

వెంకట్.బి.రావు

ముందు మాట

అక్షరాల మీద మమకారం ఎప్పుడు ఎలా ఏర్పడిందో సరిగ్గా చెప్పలేనుగాని, అది జీవితంలో ఒక ముఖ్య భాగమై కూర్చుంది. పుస్తకాలు పరమ నేస్తాలయ్యాక మరిక వెనక్కి మళ్ళింది లేదు. అదొక వ్యాసంగమూ, అదే ఒక వ్యాసంగమూ అయిపోయింది.

చదువుతున్నప్పుడు ఏవేవో ఆలోచనలొస్తాయి. ఒక్కొక్క సంగతి మంచిగా అనిపించి రాసి పెట్టుకోవాలనిపిస్తుంది. అలా ఆలోచనలలో దాచుకున్నవి, రాసిపెట్టుకున్నవీ కొన్నాళ్ళతరువాత తిరగేసి చూసుకుంటే, అవి నిజంగానే మరిచిపోవాల్సిన సంగతులు కాదనీ, మంచివే అనీ అనిపిస్తుంది. అలాంటి చాలా చాలా సందర్భాలలోంచి పుట్టిన చిన్న చిన్న రాతల విపులీకరణ ఫలితాలే ఈ వ్యాసాలలోని చిన్నవీ పెద్దవీ రాతలు. చాలా వాటికి తెలుగు సాహిత్యమే మూల బిందువు. మిగతా వాటికి భాష, వ్యాకరణ సంబంధ విషయాలు పధాన విషయాలు. ఇవన్నీ ఇంతకు మునుపు నా తెలుగు బ్లాగులో చిన్న చిన్న పోస్టుల రూపంలో భాగాలు భాగాలుగా వెలువడినటువంటిని. ఇప్పుడు మళ్ళీ ఒకసారి సరిచూసుకుని, అవసరమయిన చోట్ల editing చేసి, ఈ-పుస్తక రూపంలో వెలువరించబడుతున్నటువంటివి.

ఇందులోవి అన్నీ తెలుగు భాష సాహిత్య సంబంధ విషయాలు కనుక, తెలిసున్నంతలో ఒళ్ళు దగ్గరపెట్టుకునే వ్రాయడం జరిగింది. తెలియక దొర్లిన తప్పులేవయినా వుంటే, పెద్దలు పెద్దమనసు చేసుకుని మన్నిస్తారని నమ్ముతున్నాను.

వెంకట్.బి.రావు.

జులై, 2014.

ఇందులోని వ్యాసాల వరస...

1. వేణుగోపాల శతకం - కొన్ని సంగతులు
2. హాలుడు, శ్రీనాథుడు, గాథా సప్తశతి
3. వాగ్గేయం
4. తెలుగు లిఖిత (సంప్రదాయ) సాహిత్యం -'చంపూ' పద్ధతి
5. తెలుగులో మౌఖిక సాహిత్యం - చాటువు
6. పేరడీ గారడీ
7. రాజరాజు - నన్నయ
8. ఆపస్తంబుడు - ఆంధ్ర జాతి
9. తెలుగు పద్యం పోకడలు
10. తెలుగు పదాలు - కొన్ని ఆసక్తికరమైన అర్థవివరణలు
11. సాహిత్యంలో ప్రకృతి
12. సామెతలూ, వాటి సంగతులు
13. తెలుగు - భాష, ఛందస్సు, వ్యాకరణం: కొన్ని సంగతులు
14. వివిధాలు
15. తెలుగు నాటకాలు
16. చిరస్మరణీయులు: మహనీయులు మానవల్లి రామకృష్ణకవిగారు
17. యదన్నం పురుషోహ్యతి...
18. చిరస్మరణీయులు: మారేపల్లి రామచంద్ర శాస్త్రి గారు
19. వియోగం
20. తెలుగు సాహిత్యంలో 'శతక' చిత్రాలు
21. సౌందర్యతత్త్వం - కళ

వేణుగోపాల శతకం - కొన్ని సంగతులు

తెలుగు శతక వాఙ్మయంలోని అధిక్షేప శతకాలలో పోలిపెద్ది వేంకటరాయకవి రచించిన వేణుగోపాల శతకానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. కార్వేటి నగర సంస్థాన కవులలో ఇతడు ప్రముఖుడు. రాజాశ్రయంలో జీవనాన్ని గడిపినప్పిటికీ, అలా గడపాల్సి రావడంలోని సాధక బాధకాల్ని అనుభవపూర్వకంగా ఎఱిగిన వాడవడంవలన అవకాశం దొరికినప్పుడల్లా నిరసించి స్వతంత్ర దృక్పథాన్ని చాటుకుంటూనే జీవితాన్ని గడిపినట్లుగా కనిపిస్తాడు. రాజాశ్రయం ప్రమాదకరమైనదని చెప్పే ఇతని అధిక్షేప పద్యాల్లోని భావాల గాఢత ఈ అభిప్రాయానికి బాసటగా నిలిస్తుంది.

'రాజుల్ మత్తులు, వారి సేవ నరక ప్రాయంబు' అన్న పోతన గారి అధిక్షేపంలాంటివి రాజాశ్రయాన్ని కాంక్షించడంలోని తెలివితక్కువ తనం మీద అధిక్షేపాలు మొదటినుంచీ తెలుగు కవులవి వున్నాయి. ఇందులో విశేషమేమీ లేదు గాని, వేంకటరాయకవి వేణుగోపాల శతకంలో, రాజాశ్రయానికి సంబంధించినవి, వేశ్యా సాంగత్యమూ ఇంకా ఇతరాలైన దుర్వ్యసనాలకు సంబంధించిన అధిక్షేపణ పద్యాలను పక్కన పెడితే, మిగిలిన కొన్ని పద్యాలలో ఇతడు వాడిన తెలుగు పలుకుబడులూ, తెలుగు మాటల ప్రయోగాలూ, సామెతలూ కొన్ని ఇప్పుడు వాడకంలో లేనివి, ఆసక్తికరమైనవి, అచ్చమైనవి కనిపిస్తాయి.

మొదటగా, 'చెప్పు' అన్న పదాన్ని (అంటే చెప్పడం అన్న అర్థంలోని మాటను) ఆధునిక కవిత్వంలో లాగా ఇతడు ప్రయోగించిన విధం, ఈ క్రింది పద్యంలో:

"అవనీశ్వరుండు మందుడైన నర్థుల కియ్యవద్దని యొద్ది దివాను చెప్పు
మునిషీ యొకడు చెప్పు మొనసి బక్షీ చెప్పు తరువాత నా మజుందారు చెప్పు
తలద్రిప్పుచును శిరస్తా చెప్పు వెంటనే కేలు మొగిడ్చి వకీలు చెప్పు

దేశపాండ్యా తాను దినవలెనని చెప్పు మొసరద్ది చెవిలోన మొఱిగి చెప్పు

యశము గోరిన దొరకొడుకైన వాడు
ఇన్ని చెప్పులు కడద్రోసి యియ్యవలయు..."

ఇందులో ఇంతమంది '**చెప్పడాలను**' అన్న భావాన్ని ఇంపుగానూ, నిందాగర్భితంగానూ, వ్యంగ్యంగానూ **'ఇన్ని చెప్పులు'** గా చెప్పబడింది. ఆధునికత సంతరించుకున్న ఇలాంటి ప్రయోగాలు పూర్వ కవుల కవిత్వంలో చాల తక్కువగా కనిపిస్తాయి.

ఇలాంటిదే ఇంకొక విన సొంపైన ప్రయోగం **'కల కొద్ది లోపల'** అన్నది. 'తన కున్నంతలో' అన్న అర్థంలో ఈ మాటల ప్రయోగం జరిగింది ఈ క్రింది పద్య పాదంలో:

"కల కొద్దిలోపల కరుణతో మన్నించి
ఇచ్చిన వారి దీవించ వలయు"

నోరుతెరిచి అడిగిన వారికి తనకున్నంతలోనే కాదనక ఇచ్చిన వారిని దీవించాలి అని ఈ పంక్తుల భావం. ఈ మాట ఇలా ఇప్పుడు వాడకంలోనే లేదు.

నానుడులు, లోకోక్తులు అనదగినటువంటివి, అర్థం అదే అయినా ఇప్పుడు వేరే మాటలలో ప్రయోగంలో ఉన్నటువంటివి, కొన్నైతే అసలు ప్రయోగంలో లేనటువంటివి, మరికొన్ని వేంకటకవి స్వయంగా సందర్భానికి అతికేట్లుగా కల్పించినట్లు అనిపించేటువంటివి, వేణుగోపాల శతకంలో చాలా కనిపిస్తాయి. వాటిల్లో కొన్నిటిని క్రింద చూపడ మైంది:

'వెన్న యుండియు నేతికి వెదికి నటుల' - ఇంటిలో వెన్న సమృద్ధిగా ఉన్న సంగతి మరిచి నేతికోసం ప్రయాస పడినట్లుగా అని ఈ మాటల అర్థం. అంగట్లో అన్నీ ఉన్నా, అల్లుడి నోట్లో శని అనే సామెత, ఒడిలో బిడ్డను పెట్టుకుని ఇల్లాంతా వెదకడ మన్న సామెతా దీనికి

కాస్తంత దగ్గరగా అనిపిస్తాయి తప్ప పూర్తిగా ఈ మాటల అర్థంతో సరిపోగల సామెత ఇప్పుడు వ్యవహారంలో ఒక్కటి కూడా లేదని నా కనిపిస్తుంది.

'కల్ల పసిండికి కాంతి మెండు' - మెరిసేదంతా బంగారం కాదు (all that glitters is not gold అన్న ఆంగ్ల సామెతకు మక్కికి మక్కి) ఇప్పుడు వ్యవహారంలో ఎక్కువుగా వినిపించే సామెత. కాని అర్థంలో సూక్ష్మమైన తేడా ఉంది. 'ఏమీ లేని విస్తరి ఎగిరెగిరి పడుతుంది' అన్న సామెత అర్థానికి ఈ సామెత అర్థానికి ఓమొస్తరుగా సామ్యం కుదురుతుంది. కానీ ఇందులో హేళన ఎక్కువగా ధ్వనిస్తుంది. పై సామెతలో భావ గాంభీర్యం ఎక్కువ.

'అల్ప విద్వాంసుడు ఆక్షేపణకు పెద్ద' ఇంత చక్కని నానుడి ఇప్పుడు ప్రయోగంలోనే లేదు. half knowledge is always dangerous అన్న ఆంగ్ల లోకోక్తిని గుర్తుంచు కున్నంతగా మనం ఈ సామెతను గుర్తుంచుకోలేదు.

'ఆబోతు పేదల యశము గోరు' - ఇది అత్యంత హృద్యమైన నానుడి. బసవయ్యను అంత ఎత్తులో, ఉన్నతమైన రూపంలో లేపాక్షిలో మనవాళ్ళందుకు మలుచుకుని స్థాపించుకున్నారో ఈ మాటల వల్ల అర్థమవుతుంది.

'గజముపై చౌడోలు గాడిద కెత్తితే, మోయునా పడవేసి కూయు గాని' - చౌడోలు అంటే ఏనుగుపై అంబారి. భారం మోయగలడో లేడో చూసి తలకెత్తాలి అనీ, సమర్థత సరిగా గుర్తెరిగి కాని ఏపనినైనా అప్పగించ కూడదనీ ఈ మాటల అర్థం. ఇదసలు ఇప్పుడు ప్రయోగంలో లేదు.

'వలపు రూపెఱుగదు, నిద్ర సుఖం బెఱుగదు, ఆకలిలో నాల్క అఱుచి ఎరుగదు' - ఇది ఒక నానుడుల మాలిక. ఇందులో మొదటి దానికి సారూప్యత గలిగిన 'ప్రేమ గుడ్డిది' అనే ఇప్పుడు వాడుకలో ఉన్ననానుడి love is blind అనే ఆంగ్ల లోకోక్తి కి మక్కికి మక్కి. దీనిని గుర్తుంచుకుని వాడుతున్నాం మనం. నిద్ర సుఖ మెరుగదు అనే నానుడి అప్పటికి ఇప్పటికి

అలాగే ప్రచారంలో ఉంది. ఇక మూడవది 'ఆకలి రుచి ఎరుగదు' అన్న రూపంలో సంక్షిప్తమై ప్రయోగంలో ఉంది. ఆకలిలో నాల్క 'అఱుచి' ఎరుగదన్నదే హృద్యమైన అసలు రూపం.

వేణుగోపాల శతకంలోని మరి కొన్ని అర్థవంతమైన, హృద్యమైన, ఇప్పుడు అంత విరివిగా వినబడనటువంటి లోకోక్తులను క్రింద పొందుపరుస్తున్నాను:

"కలియుగ ధర్మ మేమనగ వచ్చు, నిన్నటికి ఓర్చి ఊరక యుండవలయు"
"రంభయైన తన శరీరము కరంబుల తా బిగించిన సుఖ తరములేదు"
"నత్తు లేకుండిన ముత్తైదు ముక్కు నందు (పెద్దమ్మ కొలువు తీరి యుంటుంది అని)"
"కట్ట నిల్వని చెరువు గడియ లోపల నిండు"
"పొయి పాలికే పాలు పొంగుటెల్ల"
"పొరుగూరి కేగిన పోవునే దుర్దశ"

ఇవి ఇలా ఉండగా, మరికొన్ని ఆసక్తి కరమైన సంగతులను తెలిపే పద్యాలను గురించి కూడా ఇక్కడ ముచ్చటించుకోవాలి.

ఎవరికి నచ్చిన మతాన్ని వారు అవలంబించుకునే స్వాతంత్ర్యాన్ని, వ్యక్తి స్వేచ్ఛనూ భారత దేశం మొదటినుంచీ ఇస్తూ వస్తోంది. ఆంధ్ర దేశానికి సంబంధించినంత వరకూ, శాతవాహనుల కాలంనుండీ దీనికి నిదర్శనాలున్నాయి. శాతవాహన రాజులలో, రాజకీయ అవసరాలకోసం అనుకున్నప్పటికీ, పురుషులు హిందూ మతాన్ని అనుసరిస్తే, స్త్రీలు బౌద్ధాన్ని అనుసరించారు. వర్ణాశ్రమ ధర్మాలను ఎంత కట్టుదిట్టంగా అమలుపరిచినప్పటికీ, వర్ణసంకరమయ్యే సందర్భాలు ప్రతి కాలంలోనూ అన్నో ఇన్నో ఉంటూనే ఉంటాయి. ఒక ఇంటిలో, ఆ ఇంటికి సంబంధించిన బంధువర్గంతో కలుపుకుని చూస్తే, ఎన్ని రకాల మతానుయాయులూ, వర్ణాలవారూ ఉండడానికి ఆస్కారం ఉందో తెలియచెప్పే పద్యం ఒకటి, ఆసక్తికరమైనది, వేణుగోపాలశతకంలో ఉంది. ఆ పద్యం:

"తండ్రి మధ్వాచారి, తనయు డారాధ్యుండు, తల్లి రామాంజ మతస్థురాలు,
తనది కూచిమతంబు, తమ్ముడు బౌద్ధుండు, సర్వేశ్వర మతంబు సడ్డకునిది,
ఆలు కోమటి జాతిది, అక్క జంగమురాలు, బావగారిది లింగబలిజ కులము,
ఆడుబిడ్డ సుకారి, అల్లుడు పింజారి, మఱదలు కోడలు మారువాడి,

కలియుగమ్మున వర్ణసంకరము ప్రబలి...."

ఇది కొంత అతిశయోక్తిగా అనిపించినప్పటికీ, ఇన్నిరకాలుగా ఉండడానికి అప్పట్లో అవకాశం ఉండేదంటే తప్పుకాదు. ఊళ్ళూ, నగరాలూ cosmopolitan గా మారడంలో ఆశ్చర్యపోవాలిసింది లేదుగాని, ఈ ఇల్లు దానికదే ఒక cosmopolitan ఇల్లుగా ఇందులో దర్శనమిస్తుంది.

'నాతో మాట్లాడడమే ఒక education' అంటూండే 'కన్యాశుల్కం' లోని గిరీశం పాత్ర కోతలను తలపింపజేసే పద్యం ఒకటి, ఈ క్రింద చూపించినది, వేణుగోపాల శతకంలో ఉంది:

"రామాండ కతలెల్ల మేమెఱుంగని యవే, కాటమరాజుకు కర్ణు డోడె
బాగోత కతలంట పలుమాఱు వినలేదె, యిగనేశు డర్జను నిరగ మొడిసె
బారత కతలోన బాలరా జొక్కడు, కుంబకర్ణుని బట్టి గుద్ది సంపె
కంద పురాండలకత పిల్లకాటేరి, యీరబద్రుని మెడ యిరగగొట్టె,

అనుచు మూర్ఖులు పలుకుదు రవనియందు...."

ఈ పద్యంలో చెప్పినట్లుగా, రామాయణ కథలో కాటమరాజుకు కర్ణుడు ఓడడం, భాగవత కథలో గణేశుడు అర్జునుని ఓడించడం, భారత కథలో బాలరాజు కుంభకర్ణుని గుద్ది చంపడం, కుమార స్వామి కోపంతో వీరభద్రుని మెడ విరగగొట్టడం...ఇలాంటివన్నీ ఏమీ తెలియకపోయినా అన్నీ తెల్సినట్లుగా భేషజం కనబరిచే వాళ్ళు మాట్లాడే మాటలే కదా! వినే వాళ్ళు ఉండాలే గాని, చెప్పే వాళ్ళకు కొదువ ఉండదుగా!

ఇందులోదే, మంచి ధార ఉన్న పద్యం, తన్ను తాను బేరీజు వేసుకుంటూ, చివరకు తాను నమ్మిన దేవునికి తనను తాను సమర్పించుకుంటూ చెప్పిన పద్యంతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను:

"ఖేద మోదంబుల భేదంబు తెలియక గోలనై కడపితి కొన్ని నాళ్ళు,
పరకామినుల కాసపడి పాప మెఱుగక కొమరు ప్రాయంబున కొన్ని నాళ్ళు,
ఉదరపోషణమున కుర్వీశులను వేడి కొదవచే కుందుచు కొన్ని నాళ్ళు,
ఘోరమైనట్టి సంసార సాగర మీదుకొనుచు పామరముచే కొన్ని నాళ్ళు,

జన్మ మెత్తుట మొదలు ఈ సరణి గడిచె, ఎటుల కృప జూచెదో గతంబెంచబోకు,
మదరిపువిఫాల మునిజన హృదయలోల వేణుగోపాల భక్త సంత్రాణశీల!"

***

End of Preview.

Rest of the book can be read @
http://kinige.com/book/Avee+Ivee

* * *